సీఎం రేవంత్ రెడ్డికి స్వాగతం

శనివారం నగర పర్యటనకు వచ్చిన సీఎం రేవంత్ రెడ్డికి పలువురు ప్రముఖులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా సీఎంకు హనుమకొండ, వరంగల్ కలెక్టర్లు ప్రావీణ్య, సత్యశారదాదేవి, డీజీపీ రవిగుప్తా, సీఎస్ శాంతికుమారి, మంత్రి కొండా సురేఖ, ఎంపీ కడియం కావ్య, ఎమ్మెల్యే కడియం శ్రీహరి పూలమొక్కలు, పుష్పగుచ్ఛాలు అందజేసి స్వాగతించారు. - సాక్షి నెట్‌వర్క్



సీఎం రేవంత్‌రెడ్డికి పూలమొక్క అందజేస్తున్న హనుమకొండ కలెక్టర్ ప్రావీణ్య, డీజీపీ రవిగుప్తా, స్వాగతం పలుకుతున్న మంత్రి సురేఖ, ఎంపీ కావ్య, ఎమ్మెల్యే శ్రీహరి, సీఎస్ శాంతికుమారి, సీఎస్‌కు మొక్క అందజేస్తున్న కలెక్టర్ సత్యశారదాదేవి, డీజీపీకి బొకే ఇస్తున్న సీపీ

క్లుప్తంగా

నేడు అర్బన్ కోఆపరేటివ్ బ్యాంకు వార్షిక సమావేశం

కాశిబుగ్గ: వరంగల్ అర్బన్ కోఆపరేటివ్ బ్యాంకు వార్షిక సమావేశాన్ని దేశాయిపేట రోడ్డు కేఆర్ గార్డెన్స్‌లో ఆదివారం నిర్వహించనున్నట్లు బ్యాంక్ చైర్మన్ ఎర్రబెల్లి ప్రదీప్‌రావు తెలిపారు. కాశిబుగ్గలోని మెయిన్ బ్రాంచ్‌లో శనివారం నిర్వహించిన సమావేశంలో సీఈఓ సత్యనారాయణ రావు, బ్యాంక్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు పీపీఐడీ రాష్ట్ర స్థాయి సమావేశం

హన్మకొండ చౌరస్తా: హనుమకొండలోని పద్మాక్షిరోడ్డులోని నందనార్ మాల కల్యాణ పరిచయ వేదికలో పీపుల్స్ పార్టీ ఆఫ్ ఇండియా (డెమొక్రటిక్) తెలంగాణ రాష్ట్ర స్థాయి సమావేశాన్ని ఆదివారం నిర్వహించనున్నట్లు రాష్ట్ర అధ్యక్షుడు పోతునూరి సత్యనారాయణ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు.

డీజేలు, సౌండ్ సిస్టమ్ నిర్వాహకులను ఆదుకోవాలి

కాజీపేట: ఉపాధి కోల్పోయి రోడ్డునపడిన డీజే సౌండ్ సిస్టమ్ నిర్వాహకులను రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవాలని డీజే సౌండ్ బాక్స్‌ల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మహ్మద్ యాసిన్ మియా డిమాండ్ చేశారు. కాజీపేట 61వ డివిజన్ చైతన్యపురి కాలనీ కమ్యూనిటీ హాల్‌లో శనివారం ఏర్పాటు చేసిన సంఘం సభ్యుల విస్తృత స్థాయి సమావేశంలో జిల్లా కోశాధికారి నవీన్, ప్రభాకర్, భగవాన్, శ్రీనివాస్, అక్బర్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

ఏఆర్‌ఎస్సైలకు సన్మానం

మామునూరు: ఖిలా వరంగల్ మండలం మామునూరు టీఎస్ఎస్పీ నాలుగో బెటాలియన్‌కు చెందిన ఏఆర్‌ఎస్సైలు ఎన్.సత్యనారాయణ, డి.మల్లారెడ్డి శనివారం పదవీ విరమణ పొందారు. ఈమేరకు టీఎస్ఎస్పీ పరిపాలన భవనంలో వారికి శనివారం సాయంత్రం వీడ్కోలు సమావేశం జరిగింది. ముఖ్యఅతిథిగా కమాండెంట్ శివప్రసాద్‌రెడ్డి హాజరై పదవీ విమరణ పొందిన ఏఆర్‌ఎస్సైలకు మెమోంటో అందజేసి సన్మానించారు. కార్యక్రమంలో ఏసీ కృష్ణప్రసాద్, శ్రీనివాస్, ఆర్ఐలు శోభన్, పురుషోత్తంరెడ్డి, రాజ్‌కుమార్, అశోక్, కృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.

మందుల అందజేత

కాజీపేట: కాజీపేట పట్టణంలో పక్షవాతంతో బాధపడుతూ మందులు లేక తల్లడిల్లుతున్న ఓ నిరుపేద మహిళకు కార్పొరేటర్ దాస్యం అభినవ్ భాస్కర్ రెండు నెలలకు సరిపడా మందులను కార్యకర్తల ద్వారా శనివారం అందజేశారు. పట్టణానికి చెందిన గుజ్జుల లలిత ఆరు నెలల కింద పక్షవాతం రావడంతో మంచానికే పరిమితమయింది. కుటుంబ పోషణ భారంగా మారడంతో మందుల కోసం లలిత అవస్థలు పడుతోందని తెలుసుకున్న అభినవ్ భాస్కర్.. గతంలో ఆరు నెలలకు సరిపడా మందులు అందించారు. ఇటీవల ఆ మందులు అయిపోయాయని తెలుసుకుని మరో రెండు నెలలకు సరిపడా మందులను మద్దెల కార్తీక్ ద్వారా కార్పొరేటర్ అందించారు.

భక్తిభావం పెంపొందించాలి

కాజీపేట: పిల్లలను విందులు, వినోదాలు, సినిమాలకు తీసుకెళ్తున్నట్లుగానే క్రమం తప్పకుండా దేవాలయాలకు కూడా తీసుకెళ్తూ దైవభక్తి పెంపొందించేందుకు తల్లిదండ్రులు కృషి చేయాలని శ్వేతార్క మూలగణపతి ఆలయ వ్యవస్థాపకుడు అయినవోలు వెంకటేశ్వర్లు శర్మ సూచించారు. కాజీపేట స్వయంభూ శ్వేతార్క దివ్యక్షేత్రం ఆవరణలో భక్తులతో శనివారం ఇష్టాగోష్ఠి నిర్వహించారు. పిల్లలు పాశ్చాత్య మోజులో పడిపోకుండా కాపాడుకుంటూ, ఆధ్యాత్మికత వైపు నడిపించాలని కోరారు. నాగరికత మోజులో పడి నేటి యువత తమ సంస్కృతి, సంప్రదాయాలను మరిచిపోతోందని ఆవేదన వ్యక్తం చేశారు. కట్టుబొట్టు వ్యవహారంలో విదేశీ పోకడలకు పోవడం సమంజసం కాదని హితవు పలికారు. కార్యక్రమంలో ఆలయ వైదిక కార్యక్రమాల నిర్వాహకులు రాధాకృష్ణ శర్మ, సాయికృష్ణ శర్మ, మణిదీప్, రవి తదితరులు పాల్గొన్నారు.

రక్తదానంలో పాల్గొనండి

కాశిబుగ్గ: తలసేమియా వ్యాధిగ్రస్తుల కోసం రెడ్‌క్రాస్ సొసైటీ పిలుపు మేరకు కాశిబుగ్గ జంక్షన్ సమీపంలోని సాయి అమ్మ రెసిడెన్సీలో ఆదివారం నిర్వహించనున్న రక్తదానం శిబిరంలో దాతలు పాల్గొని రక్తదానం చేయాలని నిర్వాహకులు శనివారం ఒక ప్రకటనలో కోరారు.

భోజనాల కోసం అవస్థలు

హన్మకొండ అర్బన్: సీఎం పర్యటన సందర్భంగా విధి నిర్వహణలో ఉన్న జర్నలిస్టులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. జర్నలిస్టులు, అధికారులు, ప్రజాప్రతినిధులు, భద్రతా సిబ్బందికి ప్రత్యేకంగా భోజనాలు ఏర్పాటు చేశారు. భోజనాలు మొదలైన కొంత సమయానికే అయిపోవడంతో జర్నలిస్టులు ఆగ్రహం వ్యక్తం చేశారు.

నిర్మాణాత్మక ప్రజా పోరాటాలు చేయాలి



మాట్లాడుతున్న రవి

వరంగల్ చౌరస్తా: ప్రజలు సమస్యల పరిష్కారానికి పార్టీ కార్యకర్తలు అండగా నిలిచి నిర్మాణాత్మక ప్రజా ఉద్యమాలను చేపట్టాలని ఎంసీపీఐ (యూ) రాష్ట్ర కార్యదర్శి గాదగోని రవి పిలుపునిచ్చారు. వరంగల్ అండర్ బ్రిడ్జికి సమీపంలోని ఉమ్మడి వరంగల్ జిల్లా కమిటీ సభ్యుల పార్టీ నిర్మాణ శిక్షణ తరగతులు శనివారం జరిగాయి. ఈ సందర్భంగా రవి మాట్లాడుతూ పార్టీ కార్యకర్తలు ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా నిత్యం శ్రమజీవులకు అండగా ఉంటూ ప్రజా పోరాటాలు చేపట్టాలని సూచించారు. మార్క్సిజంతోనే ప్రజా సమస్యలు పరిష్కారం అవుతాయని అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇచ్చిన ఎన్నికల హామీలు అమలయ్యేంత వరకు నిరంతరం ప్రజా ఆందోళనలు నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో వరంగల్, హనుమకొండ జిల్లాల కార్యదర్శులు పెద్దారపు రమేష్, ఎస్‌రెడ్డి హంసారెడ్డి, ఉమ్మడి జిల్లా నాయకులు గోనె కుమారస్వామి, కుసుంబ బాబూరావు, నాగెల్లి కొమురయ్య, నీల రవీందర్, కర్ర రాజిరెడ్డి, వంగల రాగసుధ, మాస్ సావిత్రి, కన్నం వెంకన్న, సుంచు జగదీశ్వర్, సింగతి మల్లికార్జున్, ఎమ్మెస్ రావు, కందికొండ కుమారస్వామి, ఎండీ.ఇస్మాయిల్, కొత్తకొండ రాజమౌళి, కేశెట్టి సదానందం, తదితరులు పాల్గొన్నారు.

సామాజిక బాధ్యత తెలిసినవారే గురువులు



ఉపాధ్యాయులను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

విద్యారణ్యపురి: సామాజిక బాధ్యత తెలిసినవారే నిజమైన గురువులు అని డెమొక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్ (డీటీఎఫ్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లింగారెడ్డి కొనియాడారు. హనుమకొండ జులైవాడలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఎస్‌జీటీ ఉపాధ్యాయుడు భిక్షపతి, స్కూల్ అసిస్టెంట్ శేరివీరయ్య ఉద్యోగ విరమణను పురస్కరించుకొని శనివారం ఏర్పాటు చేసిన సన్మాన కార్యక్రమంలో లింగారెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. హనుమకొండ ఎంఈఓ. రాంకిషన్‌రాజు మాట్లాడుతూ ఉద్యోగ విరమణ పొందిన తర్వాత కూడా పాఠశాలను మరిచిపోకుండా సేవలందించవచ్చని కార్యక్రమంలో హెచ్‌ఎం భాస్కర్‌రెడ్డి, పలు సంఘాల బాధ్యులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

డీఈఓ కార్యాలయ ఏడీ రాంకుమార్‌కు సన్మానం



ఏడీని సన్మానిస్తున్న ఉద్యోగులు

విద్యారణ్యపురి: హనుమకొండలోని జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయంలో అసిస్టెంట్ డైరెక్టర్‌గా పనిచేస్తూ, జయశంకర్ భూపాలపల్లి జిల్లా డీఈఓగా బాధ్యతలు నిర్వర్తిస్తున్న రాంకుమార్ ఈనెల 30న ఉద్యోగ విరమణ చేయనున్నారు. ఈక్రమంలో హనుమకొండ డీఈఓ కార్యాలయంలో ఆయనను ఉద్యోగులు శనివారం సన్మానించారు. డీఈఓ ఎండీ.అబ్దుల్‌హై ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఏసీజీఈ చలపతిరావు, ఓపెన్ స్కూల్ ఉమ్మడి వరంగల్ జిల్లా కోఆర్డినేటర్ శంకర్‌రావు, టీఎన్‌జీఓఎస్ ఎడ్యుకేషన్ జిల్లా అధ్యక్షుడు కలకోట్ల భరత్ సుధాకర్, రవిబాబు, అలీం, జాకీర్, జయధీర్, ఆదిత్య, బండి శ్రీను పాల్గొన్నారు.

కేయూలో పలు విభాగాల్లో క్లీన్ అండ్ గ్రీన్



ఆర్ట్స్ కళాశాలలో శ్రమదానంలో పాల్గొన్న ప్రిన్సిపాల్ జ్యోతి, విద్యార్థులు

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ మల్లారెడ్డి ఆదేశాల మేరకు పలు విభాగాల్లో శనివారం క్లీన్ అండ్ గ్రీన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. క్యాంపస్‌లోని మహిళా ఇంజనీరింగ్ కళాశాల, హిస్టరీ విభాగం, హనుమకొండలోని యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలల్లో విద్యార్థులు, అధ్యాపకులు కలిసి చెత్తాచెదారాన్ని తొలగించారు. మహిళా ఇంజనీరింగ్ కళాశాలలో ప్రిన్సిపాల్ సదానందం, ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ జ్యోతి, హిస్టరీ విభాగంలో డాక్టర్ రాజ్‌కుమార్, విద్యార్థులు పాల్గొని శ్రమదానం చేశారు. ప్రతీ శనివారం క్లీన్ అండ్ గ్రీన్ కార్యక్రమాన్ని నిర్వహించాలని ఇటీవల రిజిస్ట్రార్ సర్క్యులర్ జారీచేశారు.

రైల్వే టెక్నీషియన్లు మంచి సేవలందించారు



శ్రీనివాస్‌ను సన్మానిస్తున్న నాయకులు

కాజీపేట రూరల్: కాజీపేట రైల్వే డీజిల్ లోకోషెడ్‌లో సీనియర్ టెక్నీషియన్ ఎ.శ్రీనివాస్, టెక్నీషియన్-1గా ఆర్.మురళి మంచి సేవలందించి రైల్వేకు ఎంతో తోడ్పడ్డారని సీనియర్ డీఎంఈ ఎ.స్వరాజ్‌కుమార్ కొనియాడారు. కాజీపేట డీజిల్‌షెడ్‌లో సీనియర్ టెక్నీషియన్, రైల్వే ఎంప్లాయిస్ సంఘ్ డీజిల్ బ్రాంచ్ అసిస్టెంట్ సెక్రటరీ ఎ.శ్రీనివాస్, సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ లేఅవుట్, కాజీపేట డీజిల్‌షెడ్ లేఅవుట్ రూపకర్త, టెక్నీషియన్ -1 మురళి పదవీ విరమణ కార్యక్రమం శనివారం జరిగింది. ముఖ్యఅతిథిగా స్వరాజ్‌కుమార్ మాట్లాడుతూ ఏళ్ల తరబడి రైల్వేకు నైపుణ్యంతో సేవలందించి డీజిల్‌షెడ్ అభివృద్ధిలో భాగస్వాములై రిటైర్డ్ అవుతున్న శ్రీనివాస్, మురళి తమ కుటుంబాలతో సంతోషమైన శేష జీవితం గడపాలని సూచించారు. కార్యక్రమంలో రైల్వే సంఘ్, మజ్దూర్ యూనియన్, రైల్వే ఎస్సీ, ఎస్టీ, రైల్వే ఓబీసీ నాయకులు జగదీశ్వర్, మధుసూదన్‌రావు, వేదప్రకాష్, ఎస్‌కె.జానీవియా, శ్రీనివాస్‌నాయక్, శ్రీనుబాబు, సంతోష్‌కుమార్, కాంగ్రెస్ పార్టీ నాయకులు ఎండీ.అంకూస్, ఎండీ.యూనస్, పసునూరి మనోహర్, రైల్వే కార్మికులు, తదితరులు పాల్గొన్నారు.

మెడికల్ హబ్ టూరిజమే ధ్యేయం



మెడికవర్ ఆస్పత్రిని ప్రారంభిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి, పక్కన మంత్రులు

కాజీపేట అర్బన్: రాష్ట్రాన్ని మెడికల్ హబ్ టూరిజంగా తీర్చిదిద్దడమే తమ ధ్యేయమని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి అన్నారు. హంటర్‌రోడ్డులోని మెడికవర్ ఆస్పత్రి 23వ బ్రాంచ్ ప్రారంభోత్సవానికి సీఎం ముఖ్యఅతిథిగా హాజరై ఆస్పత్రిని ప్రారంభించి మెడికవర్ యాజమాన్యాన్ని అభినందించి మాట్లాడారు. ప్రతీ పౌరుడికి డిజిటల్ హెల్త్ కార్డును అందజేస్తామని తెలిపారు. వైద్య, ఆరోగ్య సంక్షేమ శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ మాట్లాడుతూ హైదరాబాద్‌కు దీటుగా ఓరుగల్లు నగరాన్ని మహానగరంగా తీర్చిదిద్దుతామని తెలిపారు. మెడికవర్ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ అనిల్‌కృష్ణ మాట్లాడుతూ 2015లో నలుగురితో ప్రారంభించిన మెడికవర్ నేడు 23 బ్రాంచీలుగా నాలుగు రాష్ట్రాల్లో సేవలందించడం ఆనందంగా ఉందని అన్నారు. కార్యక్రమంలో మంత్రులు కొండా సురేఖ, సీతక్క, సీఎం సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, ఎమ్మెల్సీలు బండా ప్రకాశ్, బస్వరాజ్ సారయ్య, ఎంపీలు కడియం కావ్య, బలరాంనాయక్, ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి, నాయిని రాజేందర్‌రెడ్డి, కేఆర్.నాగరాజు, మేయర్ గుండు సుధారాణి, మెడికవర్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్లు డాక్టర్ శరత్‌రెడ్డి, డాక్టర్ హరికృష్ణ, డైరెక్టర్ ఏఆర్.కృష్ణప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ కార్యాలయ నిర్మాణానికి భూమి కేటాయించండి



వరంగల్: వరంగల్ జిల్లాలో కాంగ్రెస్ పార్టీ భవన నిర్మాణానికి ప్రభుత్వ భూమి కేటాయించాలని డీసీసీ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ కోరారు. ఈమేరకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి వినతిపత్రం సమర్పించినట్లు పీసీసీ నాయకుడు ఎర్రబెల్లి వరద రాజేశ్వర్‌రావు తెలిపారు.

ఈడబ్ల్యూఎస్ అమలు చేయాలి

హన్మకొండ / హసన్‌పర్తి: అగ్రవర్ణ పేదల కోసం 10శాతం ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్‌ను రాష్ట్రంలో అమలు చేయాలని ఓసీ జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు పాడి గణపతి రెడ్డి, హసన్‌పర్తి రెడ్డి సంఘం అధ్యక్షుడు వీసం సురేందర్ రెడ్డి కోరారు. ఈమేరకు హనుమకొండ హంటర్‌రోడ్డులోని మెడికవర్ ఆస్పత్రిలో సీఎం రేవంత్ రెడ్డిని వారు శనివారం కలిసి వినతి పత్రం అందించారు. గతేడాది అప్పటి ప్రభుత్వం రిజర్వేషన్‌ను అమలు చేయకపోవడంతో అగ్రవర్ణ పేద విద్యార్థులు నష్టపోయారని పేర్కొన్నారు.

విద్యారంగ సమస్యలపై స్పందించాలి

విద్యారణ్యపురి: విద్యారంగ సమస్యలపై సీఎం రేవంత్‌రెడ్డి స్పందించాలని ఏబీఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు మంద నరేష్ డిమాండ్ చేశారు. హనుమకొండలోని హరిత కాకతీయ హోటల్ వద్ద శనివారం ఆయన మాట్లాడారు. వరంగల్ జిల్లా పర్యటనకు వస్తున్న సీఎం విద్యారంగంపై స్పష్టమైన హామీ ఇవ్వాలని కోరారు. కాంగ్రెస్ ప్రభుత్వంలోనైనా నిరుద్యోగులకు న్యాయం చేయాలని సూచించారు. డీఎస్సీ పోస్టుల పరీక్షలను వాయిదా వేసి పోస్టులను పెంచి నిర్వహించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ఏబీఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు దార సురేష్, కేయూ ప్రధాన కార్యదర్శి బండారి పృథ్వీ, కేయూ ఉపాధ్యక్షుడు అర్షం చరణ్ పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి



వినతిపత్రం అందజేస్తున్న ఏఐఎస్ఎఫ్ నాయకులు



వినతి పత్రం అందిస్తున్న విద్యుత్ నాయకులు

హన్మకొండ: రాష్ట్ర వ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు విడుదల చేయాలని ఏఐఎస్ఎఫ్ హనుమకొండ జిల్లా ప్రధాన కార్యదర్శి భాషాబోయిన సంతోష్ కోరారు. ఈ మేరకు హనుమకొండ బాలసముద్రంలోని క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డిని ఏఐఎస్ఎఫ్ నాయకులు శనివారం కలిసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా సంతోష్ మాట్లాడుతూ రాష్ట్రంలో రూ.7 వేల కోట్లకు పైగా స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు పెండింగ్‌లో ఉన్నాయని చెప్పారు. 2021-2022వ విద్యా సంవత్సరంలో సగం బకాయి ఉండగా, 2023 -2024లో మొత్తం బకాయిలు విడుదల కాలేదని అన్నారు. ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు కుక్కల కుమార్, నాయకులు కుంటి పవన్, మాలోతు శ్రీనివాస్, శివ, హేమంత్ పాల్గొన్నారు.

విద్యుత్ ఆర్టిజన్ సమస్యలు పరిష్కరించాలి

హన్మకొండ: విద్యుత్ ఆర్టిజన్ సమస్యలు పరిష్కరించాలని తెలంగాణ స్టేట్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ యూనియన్ -327 రాష్ట్ర సెక్రటరీ జనరల్ ఇనుగాల శ్రీధర్ కోరారు. ఈమేరకు హనుమకొండ బాలసముద్రంలోని క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డిని పలువురు నాయకులు శనివారం కలిసి సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తమ సమస్యలు తీసుకెళ్లాని కోరారు. సీఎంకు వినతి పత్రం అందించి సమస్యలు పరిష్కరించాలని కోరుతానని వారికి ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. కార్యక్రమంలో టీఎస్ఈఈయూ -327 ఎన్పీడీసీఎల్ కంపెనీ అధ్యక్షుడు పి.మహేందర్ రెడ్డి, హనుమకొండ జిల్లా అధ్యక్షుడు దొనికల సదయ్య, వరంగల్ జిల్లా కార్యదర్శి మచ్చిక బుచ్చయ్య గౌడ్, నాయకులు మొహిసిన్ ఖాన్, సీహెచ్.సతీష్ పాల్గొన్నారు.

సాంస్కృతిక సారథి ఉద్యోగులకు భద్రత కల్పించాలి



మంత్రికి వినతిపత్రం అందజేస్తున్న ఉద్యోగులు

వరంగల్: తెలంగాణ సాంస్కృతిక సారథి ఉద్యోగులకు ఉద్యోగ భద్రత కల్పించాలని, పెరిగిన జీతాలతో పాటు పీఆర్‌సీ వర్తింపజేయాలని సారథి ఉద్యోగులు కోరారు. ఈమేరకు హనుమకొండలో మంత్రి కొండా సురేఖను ప్రజా కళాకారుడు గిద్దె రాంనర్సయ్య, జూపాక శివ, డప్పు యుగేందర్ శనివారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగులకు వర్తించే ప్రతి అలవెన్స్‌నూ సారథి సంస్థ ఉద్యోగులకు వర్తింపజేసి కళాకారుల బతుకుల్లో వెలుగులు నింపాలని కోరారు.

‘రైతు భరోసా’పై అభిప్రాయ సేకరణ

- రైతు భరోసా విధానాల రూపకల్పన కోసం..
- నేటి నుంచి సహకార సంఘాల వారీగా మహాజన సభలు



హన్మకొండ: రైతు భరోసా విధి విధానాల రూపకల్పనకు రైతుల నుంచి అభిప్రాయాలు సేకరించాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఎన్నికల ముందు కాంగ్రెస్ ఇచ్చిన హామీ మేరకు రైతు బంధు ద్వారా ఏడాదికి రెండు పంటలకు ఎకరాకు రూ.10 వేలు ఇస్తుండగా.. రైతు భరోసా ద్వారా రూ.15 వేలు ఇస్తామని ప్రకటించింది. ఈమేరకు ప్రభుత్వం సన్నాహాలు చేస్తోంది. కాగా.. సాగు లేని భూములకు, గుట్టలకు, రియల్ వెంచర్లకు రైతుబంధు చెల్లిస్తున్నట్లు, పథకం దుర్వినియోగమవుతోందని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఈక్రమంలో రైతు భరోసాను పారదర్శకంగా, కట్టుదిట్టంగా, దుర్వినియోగం కాకుండా ఉండేందుకు ప్రభుత్వం రైతుల నుంచి సలహాలు, సూచనలు స్వీకరించాలని నిర్ణయించింది. రైతుల అభిప్రాయాల్ని క్రోడీకరించి ప్రభుత్వం ఒక నిర్ణయానికి రానుంది. ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల ద్వారా ప్రత్యేక మహాజన సభలు నిర్వహించి రైతుల వారీగా రైతుబంధు పథకం అమలవుతున్న తీరు, మార్పులు, చేర్పులు, అర్హులకు అందుతున్నాయా? సాగు భూములకు ఇస్తున్నారా.. సాగేతర భూములకు రైతుబంధు చెల్లిస్తున్నారా? వంటి అంశాలపై రైతుల నుంచి వివరాలు సేకరించనున్నారు.

రోజూ రెండు నుంచి మూడు సభలు..

కాగా రైతుల నుంచి అభిప్రాయాల సేకరణకు నిర్దిష్ట ప్రశ్నావళిని మాత్రం ప్రభుత్వం వెల్లడించలేదు. అభిప్రాయాలు వెల్లడించాల్సిన స్వేచ్ఛ రైతులకిచ్చింది. ఈమేరకు ప్రభుత్వం జిల్లా యంత్రాంగానికి ఆదేశాలిచ్చింది. జూలై 3వ తేదీలోపు ప్రత్యేక మహాజన సభలు నిర్వహించాలని సూచించింది. జిల్లా వ్యవసాయ అధికారి, జిల్లా సహకార అధికారులకు అందిన ఆదేశాల మేరకు ఇప్పటికే ప్రాథమిక సహకార సంఘాల వారీగా మహాజన సభలు నిర్వహించే తేదీలు, సమయం ఖరారు చేశారు. ప్రతీ రోజు రెండు నుంచి మూడు మహాజన సభలు నిర్వహించేలా అధికారులు ప్రణాళిక సిద్ధం చేసుకున్నారు. వరంగల్ డీసీసీబీ పరిధిలో మొత్తం 90 ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలున్నాయి. సిద్దిపేట జిల్లాలో 3 పీఏసీఎస్‌లు, వరంగల్ జిల్లాలో 27, హనుమకొండ జిల్లాలో 15, ములుగు జిల్లాలో 11, భూపాలపల్లి జిల్లాలో 5, మహబూబాబాద్ జిల్లాలో 16, జనగామ జిల్లాలో 13 ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలున్నాయి. జిల్లా వ్యవసాయ శాఖ అధికారులు, జిల్లా సహకార అధికారులు ఎవరెవరికి ఏయే సంఘాలు అనేవి ఖరారు చేసుకున్నారు. అధికారుల సమక్షంలో సంబంధిత సహకార సంఘం చైర్మన్ అధ్యక్షతన మహాజన సభలు నిర్వహిస్తారు. ప్రతీ రోజు నిర్వహించే మహాజన సభల్లో వచ్చిన రైతుల అభిప్రాయాల్ని జిల్లా సహకార అధికారులు రాష్ట్ర ప్రభుత్వానికి పంపుతారు.

సంక్షిప్తంగా

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలు

ఖిలా వరంగల్: వరంగల్ - నర్సంపేట రోడ్డులోని గొర్రెకుంట సమీపంలో శుక్రవారం అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. బాధితుడి కథనం ప్రకారం ఖిలా వరంగల్ తూర్పు కోటకు చెందిన బరిగెల రవీందర్ వ్యక్తిగత పనిమీద బైక్‌పై గొర్రెకుంటకు వెళ్లి తిరిగి శుక్రవారం రాత్రి ఇంటికి బయలుదేరాడు. ఈక్రమంలో గొర్రెకుంట క్రాస్‌రోడ్డుకు చేరుకోగానే బైక్‌ను గుర్తుతెలియని లారీ ఢీకొట్టింది. దాంతో బైక్‌పై నుంచి రవీందర్ రోడ్డుపై పడడంతో తీవ్ర గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న కుటుంబ సభ్యులు నగరంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. బాధితుడి తండ్రి గీసుగొండ పోలీసులకు శనివారం ఫిర్యాదు చేసినట్లు తెలిసింది.

రూ.23 వేల విలువగల గుట్కాలు స్వాధీనం

కాజీపేట: కాజీపేట పట్టణంలోని పలు దుకాణాలపై టాస్క్‌ఫోర్స్ పోలీసులు శనివారం దాడులు చేసి రూ.23 వేల విలువైన గుట్కాలను స్వాధీనం చేసుకుని ఒకరిపై కేసు నమోదు చేశారు. సీఐ సుధాకర్ రెడ్డి కథనం ప్రకారం చౌరస్తాకు సమీపంలో ఉన్న గన్ను వెంకటేశ్వర్లు అనే వ్యాపారి దుకాణంలో సోదాలు చేయగా గుట్కాలు, అంబర్‌లు లభించారు. హెడ్ కానిస్టేబుల్ జనార్దన్ ఫిర్యాదు మేరకు నిందితుడిపై ఎస్సై శివకృష్ణ కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నారని సీఐ వివరించారు.

విద్యుదాఘాతంతో పాడి గేదెల మృతి

మామునూరు: విద్యుదాఘాతంతో రెండు పాడి గేదెలు మృతి చెందాయి. బాధితుల కథనం ప్రకారం ఖిలా వరంగల్ మండలం తిమ్మాపురం గ్రామానికి చెందిన పాడి రైతులు బండి శ్యామ్, బండి ఎల్లయ్యకు చెందిన రెండు పాడి గేదెలు రోజువారీగా శుక్రవారం మేతకు వెళ్లాయి. కిందపడి ఉన్న విద్యుత్ సరఫరా గల వైర్లకు గేదెలు తగలడంతో అవి అక్కడికక్కడే మృత్యువాత పడ్డాయి. నష్టపరిహారం వచ్చేలా చూస్తానని బాధితులకు ఎమ్మెల్యే నాగరాజు హామీ ఇచ్చినట్లు తెలిసింది.

మహాత్ములను ఆదర్శంగా తీసుకోవాలి

కాజీపేట రూరల్: విద్యార్థులు మహాత్ముల జీవితాలను ఆదర్శంగా తీసుకొని ముందుకు సాగాలని అపోలో ఆస్పత్రి కన్సల్టెంట్ డాక్టర్ ఆశిష్ చౌహాన్ సూచించారు. కాజీపేట సెయింగ్ గ్యాబ్రియల్ స్కూల్‌లో శనివారం ఇన్వెస్టిచర్ సెరమనీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రిటైర్డ్ డీజీపీ డాక్టర్ కూచిపుడి బాబురావు, బ్రదర్ పి.ఆంటోని మాట్లాడుతూ విద్యార్థులు తమ కోసం కాకుండా దేశం కోసం ఆలోచించాలని పిలుపునిచ్చారు. రెవరెండ్ ఫాదర్ టి.జోసెఫ్, నిట్ ప్రొఫెసర్ సీఎస్ఆర్‌కే.ప్రసాద్, డాక్టర్ ఓంప్రకాష్, ఒయాసిస్ స్కూల్స్ ప్రిన్సిపాల్ డాక్టర్ జె.పరంజ్యోతి మాట్లాడారు.